

కథా కౌముది

# డిగ్నిటీ ఆఫ్ లేబర్

డా.మజ్జి భారతి

"నేను పెట్టింది తిని ఆ గంగిముండకి బలుపెక్కువయింది. జీతం పెంచేదీలేదు, యేమీ లేదు. నువ్వేమీ మాట్లాడకు. నేను చూసుకుంటాను." మీ దగ్గర చేరి మూడు సంవత్సరాలైంది. జీతం పెంచండమ్మా అని ఆ ఇంట్లో పని చేసే గంగమ్మ వురఫ్ గంగి అడిగిందని యింట్లో అత్తాకోడళ్ళ మధ్య ఈ సంభాషణ. ఆ ఇంటి కోడలు శిరీష, టీచరుగా అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో వున్న పాఠశాలలో పనిచేస్తుంది.

"మూడేళ్లుగా జాగ్రత్తగా పని చేస్తుంది. అసలు గంగమ్మ అడగకుండానే పెంచాల్సిందని" శిరీష అంటే "చాల్లే! నీకేమీ తెలియదు. ఒక్కరోజు లేటవ్వకుండా నెలనెలా జీతం చేతిలో పోస్తున్నాం. మధ్యాహ్నం నేను పెట్టింది హాయిగా తిని యిక్కడే పడుకొని, సాయంత్రం మిగిలిన వాళ్ళింటికి పనికి వెళ్తుంది. ఇంకా జీతం పెంచాలా? ఏమవసరం లేదు. ఇంతింత పెడుతున్నా, ఆమాత్రం విశ్వాసముండొద్దా! జీతం పెంచకపోతే మానేస్తాదా? మానెయ్యమను. ఆ జీతానికే ఇంకొకరిని దర్జాగా తీసుకొచ్చి పెడతాను. అప్పుడు తెలుస్తుంది ఆ గంగిముండకి యీ యింటి విలువేమిటో!" కామాక్షమ్మగారి మాటలు బయటికే వినిపిస్తున్నాయి. అసలే ఆవిడది కంచు కంఠం. దానికి తోడు కోపంతో యింకా గట్టిగా మాట్లాడుతుంది. గేటు తీసిన శబ్దమైంది గాని, చూస్తే ఎవరూ లేరు. అప్పుడే అనుమానమొచ్చింది శిరీషకు. ఐనా ఏమీ మాట్లాడలేదు.

"సరే మీ యిష్టమత్తయ్యా! పని చేయించుకునేది మీరు. మీకెలా నచ్చితే అలా చేయండి" అని స్కూలుకెళ్ళిపోయింది.

★★★

ఆ మరుచటి రోజు ఉదయం యెనిమిదింటికే గేటు తీసుకొని వస్తున్న గంగమ్మను చూసి కళ్ళెగరేసింది కామాక్షమ్మ, నేను చెప్పలేదా అదెక్కడికి పోతుంది. యిక్కడికే వస్తుందన్నట్టు. "ఇంకా వంటవ్వలేదు. రెండు గంటలాగిరా! గిన్నెలు

బయట వేస్తానన్న" కామాక్షమ్మతో "మీ ఇంట్లో పని చెయ్యడానికి రావాలా వద్దా అని కనుక్కోడానికే వచ్చాను. జీతం పెంచుతామంటే వస్తాను. లేకపోతే వేరే ఇల్లు చూసుకుందామని" అని శిరీషనే చూసి అడిగింది గంగమ్మ.

శిరీష మాట్లాడేలోగా "పైసా పెంచేది లేదు. నచ్చితే చెయ్యి. లేకపోతే లేదు. ఈ మాత్రం జీతమిచ్చి రోజూ టిఫిన్ పెడుతుంటే కళ్ళకద్దుకొని ఎవరైనా పని చేస్తారనేసింది" కామాక్షమ్మ. "అయితే వస్తానమ్మ గారంటూ" శిరీషతో చెప్పి బయటికెళ్ళిపోయింది గంగమ్మ.

"చూసావా దాని పొగరు. కనీసం నా వైపు చూసి కూడా మాట్లాడలేదు. వెళ్ళు... వెళ్ళు... మళ్ళా నా కాళ్ళ దగ్గరికి నువ్వే వస్తావు. తప్పయిందమ్మా అనుకుంటూ. అప్పుడు తెలుస్తుంది ఈ కామాక్షమ్మ విలువేమిటో!" అంటూ కోపంతో చిందులేస్తున్న ఆవిడని ఏమీ అనలేక "నాకు స్కూలుకు లేటవుతుందంటూ" లోపలికెళ్ళిపోయింది శిరీష.

★★★

రెండునెలల తర్వాత... యెండలో ఇంటికెళ్తున్న గంగమ్మ పక్కన స్కూటీ ఆపింది శిరీష. ఈ రెండు నెలలలో ఇద్దరు పనిమనుషులు మారారని, కామాక్షమ్మగారు ప్రాణప్రదంగా చూసుకునే వెండి మరచెంబు మాయమయ్యిందని, యింకా చిన్నా చితకా వస్తువులు పోతున్నాయని మిగిలిన పని మనుషుల ద్వారా వింటూనే వుంది గంగమ్మ.

పనికి రమ్మని అడగడానికి వచ్చారానన్న అనుమానంతో, "బాగున్నారమ్మా! పనికైతే మీరు రమ్మన్నా రాలేను" అనేసింది. "అబ్బ! అక్కడికి కాదులే. ముందు బండెక్కు" చనువుగా గసిరింది శిరీష. పనిమనిషినని కూడా చూడకుండా ఎప్పుడైనా త్రోవలో కనిపిస్తే స్కూటీ ఎక్కించుకుంటుందని శిరీష అంటే చాలా గౌరవం గంగమ్మకు.

"స్కూల్లో వంట చేసే ఆవిడ ఈరోజు చెప్పా పెట్టకుండా మానేసింది. అందుకే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. ఇప్పుడు మాత్రం నా మాట కొట్టెయ్యకు. పాపం పిల్లలు ఆకలితో ఉంటారు" అంది శిరీష. "అయ్యో! మీరంతగా చెప్పాలమ్మా" అంటూ పనిలో చొరబడిపోయింది గంగమ్మ స్కూలుకి వెళ్ళగానే. వంటకాలు బాగున్నాయని ఆ పూట పిల్లలందరూ ఒక ముద్ద ఎక్కువే తిన్నారు. ఎప్పుడూ గిన్నెలో మిగిలిపోయే అన్నం ఆరోజు కనిపించలేదు. టీచర్ల ముఖంలో ఆనందం, బాగా వంట చేసి పెట్టిందని.

"మొదటిరోజు ఎవరైనా బాగానే వండుతారు పనిలోకి రావాలని. పనిలో చేరగానే మారిపోతారు" అంది యెప్పుడూ అన్నింటికీ వంకలు పెట్టే ఒక టీచర్. "ఈవిడను చూస్తే అటువంటి మనిషిలాగ లేదనేసింది" సోషల్ టీచర్. "నాలుగు రోజులు చూసి పనిలో పెట్టుకుంటే బాగుంటుందేమో!" అన్నాడు పిటి. అంతకు ముందు పని చేసే ఆవిడ మధ్య మధ్యలో నాగాలు పెట్టి ఆఖరికి చెప్పా పెట్టకుండా పని మానేసిందట. నేను బాగా పని చేసే ఆమెను తెస్తాను, ఇంకెవరిని అడగవద్దని గంగమ్మను తీసుకొచ్చిందట శిరీష.

"నీకైతే ఈ పని బాగుంటుందని తెలుసు. కాని ముందు కుదిరినావిడ వుంటుండగా, అడిగితే బాగుండదని వూరుకున్నాను. ఇప్పుడావిడంతట ఆవిడే మానేసింది. కాబట్టి యీ పని అప్పచెప్తే నీకూ బాగుంటుంది, పిల్లలకూ బాగుంటుందని హెడ్మాస్టర్ గారికి చెప్పాను. ఆయన కూడా ఓకే అన్నారు" అని చెప్పింది శిరీష.

"మీరు నాకు పని అప్ప చెప్పారని పెద్దమ్మగారు ఏమైనా అంటారేమోనమ్మా!" అనుమాన పడింది గంగమ్మ. "అప్పుడు చూద్దాంలే" నవ్వేసింది శిరీష. శిరీష చెప్పకపోయినా, కామాక్షమ్మ గారి చెవిలో ఆ విషయం వూదేసారెవ్వరో! పూనకం వచ్చినట్లు వూగిపోయారావిడ.

"మనింట్లో పని మాన్పించేసిన గంగికి మీ స్కూల్లో పని యిప్పించావట. ఇంట్లో కొత్త మనుషులతో పనిచేయించుకోలేక నేనిక్కడ అవస్థ పడుతుంటే, నువ్వా గంగికి పని యిప్పిస్తావా? ఇదేనా నువ్వు నాకిచ్చే గౌరవం?" అని అడిగిన కామాక్షమ్మతో "మనింట్లో పనిమనిషి సంగతి మీరే చూసుకుంటానన్నారు. నన్నేమీ మాట్లాడొద్దన్నారు. మీ మాట మీద గౌరవంతో నేనేమీ కల్పించుకోలేదు. అక్కడ స్కూల్లో వంటమనిషి పని నాకప్పచెప్పారు. గంగమ్మకన్నా నమ్మకమైన మనిషి, బాగా పని చేసే మనిషి నాకు కనిపించక గంగమ్మనే అడిగాను. సరేనంది" అనేసింది శిరీష. బయటికేమీ అనలేక మనసులోనే గింజుకుంది కామాక్షమ్మ.

★★★

ఇంట్లో పనికి మనుషులొస్తున్నారు. వెళ్లిపోతున్నారు. కొంతమందితో కామాక్షమ్మగారికే కుదరక... మరి కొంతమంది ఈవిడ చాదస్తం భరించలేక. ముందు అనుకున్న పని కాక, వేరే ఏదైనా పనిచెప్తే చెయ్యమన్నవాళ్లు కొందరైతే, ఎక్స్ట్రా గా డబ్బులిస్తేనే చేస్తామన్న వాళ్లు కొందరు. ఏ పని చెప్తే ఆ పని చేసేది కాని, గంగమ్మేరోజూ ఎక్కువ పని చేసినందుకు డబ్బులడగలేదు. అందరిళ్లల్లో పనిచేసి వచ్చి, కామాక్షమ్మగారు యేదో పెడితే తినేసి, అది దులుపు... యిది దులుపు... యీ పప్పు శుభ్రం చెయ్యి... అంటూ యే పని చెప్పినా కాదనకుండా చేసేసేది. ఇంట్లో పనికిరాని వస్తువులు, పాత బట్టలు యిస్తే యెంచకుండా పట్టుకుపోయేది. ఇప్పుడలా యెవరికైనా యివ్వబోతే "ఈ పాడైపోయినవి మాకెందుకమ్మా! యిస్తే మంచివివ్వాలి గాని" అని ముఖంమీదే అనేస్తున్నారు. ఇన్నాళ్లూ గంగికి యెంతో యిచ్చేసాననుకున్న కామాక్షమ్మ గారికి తెలిసొస్తోంది గంగి విలువేమిటో!

గంగి వున్నప్పుడు దర్జాగా కాలుమీద కాలు వేసుకుని పనులు చేయించుకునేది. ఏ వస్తువైనా పోతుందన్న భయంలేదు. అన్నీ జాగ్రత్త పెట్టేది. కొత్తగా వచ్చినవాళ్ళకంత జాగ్రత్త లేక యెక్కడి వస్తువులక్కడే వదిలేసిపోతున్నారు. మొన్న వెండి మరచెంబు పోయింది. అందుకని వాళ్లు పని చేస్తున్నంతసేపూ వెనకెనకే తిరగాల్సి వస్తుంది. దానికితోడు కొత్తగా వచ్చినవాళ్ళు యెటువంటి వారోనన్న అనుమానం కూడా ఒక కారణం. "మీకింత అనుమానమైతే మేం పని చెయ్యలేమమ్మా! యే వస్తువు పోయినా మాకు దొంగతనమంట కడతారు. ఇంట్లో గడవక పనికి వచ్చాం గాని, మీరేదంటే

అది పడడానికి కాదని" కొంతమంది మానేశారు. వాళ్లు చేసే పని నచ్చక, కామాక్షమ్మగారే కొంతమందిని మాన్పించేశారు. ఈ ఆరు నెలల్లో పదిమంది మారారు.

"మీ కోడలు పనిచేసే స్కూల్లోనే గంగమ్మ పనిచేస్తుందట కదా! మీ కోడలే అక్కడ పనికి కుదిర్చిందట కదా! పనివాళ్ళతో అవస్థ పడకపోతే గంగమ్మను పిలిపించుకోవచ్చు కదా!" అని ఇరుగుపొరుగులు. దాంతో తల కొట్టేసినట్టు వుంటుంది కామాక్షమ్మగారికి.

ఆవిడంతట ఆవిడే గంగిని పనికి పిలవమనడానికి నామోషి. శిరీష యేమీ పట్టించుకోవడం లేదు. కొడుకుతో చెప్పుకుంది. మీ అత్తా కోడళ్ళ మధ్య నన్ను దూర్చకనేశాడు కొడుకు. ఇంక తప్పదన్నట్టు "గంగిని పనికి రమ్మనొచ్చు కదా! అలవాటైన మనిషి" అనేసింది.

"ఎంత పనిమనిషైతే మాత్రం, ఆమె మనిషి కాదా? మనమేమైనా జీతం ఊరికే యిస్తున్నామా? పని చేయించుకుని యిస్తున్నాం. ఆ మాత్రం దానికి మన సొమ్మేదో ధారపోసినట్టు నానా మాటలంటే వూరుకుంటారా ఎవరైనా? మీరు జీతం పెంచకపోయినా పని చేసేదేమో! కాని గంగమ్మ ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టారు. అందుకే తను పని మానేసిందన్న" శిరీషతో "నేనేమి చేశానని?" ఆశ్చర్యపోయిన కామాక్షమ్మతో "గుర్తు తెచ్చుకోండి మీరన్న మాటలు" అనేసి అక్కడనుండి కోపంగా వెళ్లిపోయింది శిరీష.

కోడలికంత కోపం వచ్చిన మాటలేమన్నానా అని ఆలోచిస్తే "గంగిముండకి బలుపెక్కువయింది. ఇంతింత పట్టుకుపోతున్నా, ఆమాత్రం విశ్వాసముండొద్దా! జీతం పెంచకపోతే మానేస్తాదా? మానెయ్యమను. ఆ జీతానికే ఇంకొకరిని దర్జాగా తీసుకొచ్చి పెడతాను. అప్పుడు తెలుస్తుంది ఆ గంగిముండకి యీ యింటి విలువేమిటో?" తనన్న మాటలు గుర్తుకొచ్చాయి.

ఏమైంది తన బుద్ధి? పనిమనిషంటే అంత చులకనా తనకు? ఆరు నెలలలో పదిమంది మారితే కాని, గంగి.. ఛీఛీ.. పాడునోరు... గంగమ్మ విలువ తెలియలేదా తనకు? నోరెత్తకుండా యే పని చెప్తే ఆ పని చేసే పిల్ల, చేసిన పనికి జీతం పెంచమంటే... నేనేనా అంతంత మాటలన్నది. గంగమ్మ కాబట్టి ఎదురుమాట చెప్పకుండా వెళ్ళిపోయింది. దానికితోడు చక్కగా కాపురం చేసుకుంటున్న పిల్లను పట్టుకుని ముండని అన్నానేమిటి? నా నోరు పడిపోనూ. అదే యింకెవరైనా ఐతే... అమ్మో! అన్ని మాటలూ నన్ననరూ! పొరపాటై పోయింది. ఈ బుద్ధి ముందే లేకపోయిందెందుకని? డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే, అమెరికాలో కూతురు దగ్గరికెళ్ళినప్పుడు దగ్గరనుండి చూసింది కదా! అక్కడ పనివాళ్లకు ఎంత మర్యాద యిస్తారో! పని చేస్తున్నారా లేదా, అన్నది ముఖ్యం కాని, యేపని చేస్తున్నారన్నది ముఖ్యం కాదని తన కూతురు యెన్నోసార్లు చెప్పింది తనకు. దానినిక్కడ ఆచరణలో చూపించలేకపోయింది తాను. పని విలువ తెలియని మూర్ఖురాలయింది.

ఇంతమంది పని మారితే కాని తనకి బుద్ధి రాలేదు. అందుకే కోడలు కూడా వూరుకుంది. మనసులోనే లెంపలేసుకుంది కామాక్షమ్మ. ఇంత జరిగాక గంగమ్మను యింట్లో పనికి కోడలు పిలవదని అర్థమై, గంగమ్మ వస్తుందో రాదోనని... రాకపోయినా పర్వాలేదు, తప్పైపోయిందని చెప్దామని...

భయపడుతూ, భయపడుతూ గంగమ్మ ఇంటికెళ్లిన కామాక్షమ్మగారితో "వూరుకోండమ్మగారు. మీరింతగా అడగాలా! అలవాటైన యిల్లు. రమ్మంటే యెందుకు రానూ?" అనేసింది గంగమ్మ, కామాక్షమ్మ నెత్తిన పాలు పోసినట్లు.

★★★★★★

COMMENTS